నమస్తే తెలంగాణ
మహబూబ్‌నగర్
నారాయణపేట
5 | మహబూబ్‌నగర్, మంగళవారం 2 ఏప్రిల్ 2024 | MAHABUBNAGAR NARAYANPET

గోదాంలో మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

ఎగిసిపడిన మంటలు

- పెబ్బేరువ్య వసాయ గోదాంలో భారీఅ గ్నిప్రమాదం
- రూ.10 కోట్ల విలువైన గన్నీ బ్యాగులు దగ్ధం
- ధాన్యం బస్తాలకూ నిప్పు, ధ్వంసమైన గోదాం

పెబ్బేరు, ఏప్రిల్ 1 : పెబ్బేరు వ్యవసాయ మార్కెట్ యార్డులోని ఐదు వేల మెట్రిక్ టన్నుల గోదాంలో సోమవారం భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకున్నది. ఇందులో పౌరసరఫరాల శాఖ గన్నీ బ్యాగులను పెద్ద ఎత్తున నిల్వ ఉంచింది. దాదాపు రూ.10 కోట్ల మేర ఆస్తి నష్టం సంభవించింది. ప్రమాదం ఎలా సంభవించిందో నిర్ధారణ కానప్పటికీ.. అగ్ని కీలలను అదుపు చేయడానికి వనపర్తి, కొత్తకోట, గద్వాల నుంచి వచ్చిన మూడు ఫైర్ ఇంజన్లు, స్థానిక మున్సిపాలిటీ ట్యాంకర్లు గంటల కొద్దీ శ్రమించాల్సి వచ్చింది. సాయంత్రం మొదలైన మంటలు రాత్రి వరకు అదుపులోకి రాలేదు. ఈ గోదాంలో పౌరసరఫరాల శాఖ 1,280 లక్షల గన్నీ బస్తాలను నిల్వ ఉంచగా, మొదట వాటికే నిప్పంటుకుంది. ప్రమాదంలో మొత్తం బస్తాలు కాలి బూడిదయ్యాయి. వీటి విలువ రూ.10 కోట్ల వరకు ఉంటుందని అధికారులు అంచనా వేశారు. ఈ బ్యాగులకు ఇరువైపులా మిల్లర్లకు చెందిన 84 వేల సీఎంఆర్ ధాన్యం బస్తాలుండగా.. వాటిలో కొంత మేర అగ్నికి ఆహుతయ్యాయి. వీటి నష్టాన్ని ఇంకా అంచనా వేయలేదు. గోదాం కూడా చాలా వరకు అగ్నికి ధ్వంసం కాగా, విలువపై స్పష్టత రాలేదు. ప్రమాద తీవ్రతను తగ్గించేందుకు జేసీబీలతో గోదాం గోడలను పగులగొట్టాల్సి వచ్చింది. స్థానికులు కూడా మంటలను ఆర్పేందుకు కృషి చేశారు. కొందరు ట్యాంకర్ల యజమానులు స్వచ్ఛందంగా నీటిని తెచ్చి ఫైర్ ఇంజన్లలో పోశారు. అయితే అదనపు కలెక్టర్ నగేశ్, మార్కెటింగ్ డీఎం స్వర్ణసింగ్, తాసీల్దార్ లక్ష్మి, ఎస్సై హరిప్రసాద్‌రెడ్డి, పుర కమిషనర్ ఆదిశేషు, మున్సిపల్ వైస్‌చైర్మన్ కర్రెస్వామి సహాయక చర్యల్లో పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కౌంటింగ్ వాయిదా

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 1 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : స్థానిక సంస్థల శాసన మండలి ఉప ఎన్నిక కౌంటింగ్ జూన్ 2కు వాయిదా వేసినట్లు రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రవినాయక్ సోమవారం ప్రకటనలో తెలిపారు. మంగళవారం జరిగే ఉపఎన్నిక కౌంటింగ్‌ను వాయిదా వేస్తూ, జూన్ 5వ తేదీలోగా ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయాలని కేంద్ర ఎన్నికల సంఘం సోమవారం నోటిఫికేషన్ జారీ చేసినట్లు వెల్లడించారు. కేంద్ర ఎన్నికల సంఘం పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ మార్చి 16న ప్రకటించిన నేపథ్యంలో అదేరోజు నుంచి ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చినట్లు చెప్పారు. అయితే ఎమ్మెల్సీ ఉపఎన్నిక కౌంటింగ్ పార్లమెంట్ ఎన్నికలపై ప్రభావం చూపే అవకాశం ఉన్నందున కేంద్ర ఎన్నికల సంఘం ఉపఎన్నిక కౌంటింగ్‌ను జూన్ 2వ తేదీకి వాయిదా వేస్తూ నిర్ణయం తీసుకుందన్నారు.

డీలా పడ్డ నేతలు

ఎమ్మెల్సీ ఎన్నిక ఫలితాల ప్రక్రియను నిలిపివేస్తూ కేంద్ర ఎన్నికల సంఘం తీసుకున్న నిర్ణయం అధికార కాంగ్రెస్‌కు షాక్ ఇచ్చింది. నేడు ఫలితాలు వెల్లడవుతాయని ధీమాతో ఉన్న అభ్యర్థులు ఎన్నికల సంఘం నిర్ణయంతో డీలాపడ్డారు. పార్లమెంట్ ఎన్నికల కౌంటింగ్ రోజే ఈ ఉపఎన్నిక కౌంటింగ్ కూడా జరుగుతుండడంతో ఫలితాలపై తీవ్ర ఉత్కంఠతో ఎదురుచూసిన ఆయా పార్టీల నేతలు సైతం నిరాశకు గురయ్యారు. నేడే ఎన్నికల ఫలితాలు ఉంటాయని భావించి ఆయా రాజకీయ పార్టీలు ముందస్తుగా మహబూబ్‌నగర్‌లో హోటళ్లను బుక్ చేసుకున్నారు. ఫలానా అభ్యర్థి గెలుస్తారని దానిపై బెట్టింగ్లు కూడా కట్టారు. మంగళవారం జిల్లా కేంద్రంలో పెద్ద ఎత్తున విందులు కూడా ఏర్పాటు చేసుకున్నారు. కౌంటింగ్ వాయిదా వేయడంతో హోటల్స్ బుక్ చేసుకున్న వారి జేబులు గుల్లయ్యాయి. కాగా అధికార పార్టీకి అనుకున్న స్థాయిలో స్థానిక ప్రజాప్రతినిధులు ఓటు వేయకపోవడంతో కొంతమంది ఆ పార్టీ నేతలు ఎన్నికల సంఘాన్ని సంప్రదించి కౌంటింగ్ వాయిదా వేయమని కోరినట్లు తెలుస్తోంది. ఒకవేళ అధికార పార్టీ ఓడిపోతే వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా దీని ప్రభావం పడుతుందని ఉద్దేశంతో కౌంటింగ్ వాయిదా వేసినట్లు చర్చ జరుగుతుంది.

ఉమిత్యాలలోఎం డినప ంటలనుప రిశీలిస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

కాంగ్రెస్ పాలనలో

కరువు తాండవం

- ఇది సహజంగా వచ్చినది కాదు.. అసమర్థ సర్కారు తెచ్చిన కరువు
- పంటలు ఎండుతున్నా పట్టించుకోని ప్రభుత్వం
- పచ్చని తెలంగాణను బీళ్లుగా మార్చారు
- రైతు ఆత్మహత్యలన్నీ ప్రభుత్వ హత్యలే..
- ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి
- కేటీదొడ్డి మండలంలో పర్యటన

కేటీదొడ్డి, ఏప్రిల్ 1 : వందరోజుల కాంగ్రెస్ పాలనలోనే తెలంగాణ రాష్ట్రంలో కరువు తాండవం చేస్తుందని, ఇది సహజంగా వచ్చినది కాదు.. అసమర్థ కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన కరువని, కేసీఆర్ అద్భుతంగా మార్చిన పంట పొలాలను బీళ్లుగా చేశారని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం కేటీదొడ్డి మండలం ఉమిత్యాల గ్రామంలో ఎండిన పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు ఎమ్మెల్యే వద్ద తమ గోడును వినిపించి ఆదుకోవాలని వేడుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఎక్కడికక్కడ పంటలు ఎండుతున్నా పాలకులు పట్టించుకున్న పాపాన పోలేదని, ఎండిన పంటలపై కనీసం సమీక్ష కూడా చేయడం లేదన్నారు. మంత్రులు ఏసీ కార్లల్లో తిరుగుతూ రైతుల బాధలు పట్టించుకోవట్లేదన్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో వ్యవసాయ రంగం అంటేనే అద్భుతం అనుకునేవాళ్లమని, ఇలాంటి రోజు రైతులకు వస్తుందని అనుకోలేదన్నారు. ప్రతిపక్ష నాయకులు రైతుల బాధలు తెలుకోవడానికి పోతుంటే కూడా హేళన చేసి మాట్లాడుతున్నారని వాపోయారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రతిపక్ష నాయకులను కాంగ్రెస్‌లో చేర్చుకోవడంలో ఉన్న శ్రద్ధ రైతులపై చూపడం లేదన్నారు. ఆయనకు ఢిల్లీకి తిరగడంతోనే సగం సమయం సరిపోయిందని ఎద్దేవా చేశారు. గ్రామాల్లో కనీసం తాగడానికి కూడా నీళ్లు లేవన్నారు. గతంలో తాగునీటి సమస్య తలెత్తకూడదని తాము కర్ణాటక రాష్ట్రం నుంచి నీళ్లు తెచ్చామని ఇప్పుడు ఆ పరిస్థితి కూడా లేదని, ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నా పట్టించుకోకపోవడం సిగ్గుచేటన్నారు. కరెంటు సమస్య కూడా తీవ్రంగా ఉన్నట్లు రైతులు చెబుతున్నారని.. ఇన్ని సమస్యలు ఉంటే రైతులు, ప్రజలు ఎలా బతకాలని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కనీసం రైతుబంధు కూడా ఇవ్వడానికి చేత కాదా అని అన్నారు. ఎకరం వరి పండించడానికి పెట్టుబడి కోసం సుమారు రూ.30 వేల వరకు ఖర్చు అవుతుందని, ఇప్పుడు చేతికొచ్చిన పంటలు ఎండితే వారి పరిస్థితి ఏంటన్నారు. రాష్ట్రంలో సుమారు 200 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని, ఇవి ఆత్మహత్యలు కావని ప్రభుత్వం చేసిన హత్యలే అని అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి వ్యవసాయ అధికారులతో ఎండిపోయిన పంటల వివరాలు సేకరించి ఎకరాకు పంట నష్టం కింద రూ.20 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రాజశేఖర్, వైస్ ఎంపీపీ రామకృష్ణనాయుడు, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ఉరుకుందు, నాయకులు చక్రధర్‌రావు, హనుమంతు, గోవిందు, యుగేంధర్‌గౌడ్, వెంకన్‌గౌడ్, వీరేశ్, గోపి, రాజేశ్, జాంపల్లి వెంకటేశ్వర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రికార్డు బ్రేక్

- బాదేపల్లి వ్యవసాయ మార్కెట్‌కు రూ.7,68,83,968 ఆదాయం

జడ్చర్ల, ఏప్రిల్ 1 : బాదేపల్లి వ్యవసాయ మార్కెట్‌కు 2023-24కు గానూ రికార్డు స్థాయిలో రూ.7,68,83,968 ఆదాయం వచ్చింది. గతేడాది కంటే ఈసారి దాదాపు రూ.రెండు కోట్లు పెరిగింది. 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి చివరి వరకు మార్కెట్‌కు వచ్చిన వివిధ వ్యవసాయ ఉత్పత్తుల క్రయవిక్రయాలకు సంబంధించిన మార్కెట్ ఫీజు రూపేణా ఈ ఆదాయం వచ్చినట్లు మార్కెట్ కార్యదర్శి శ్రీనివాస్ తెలిపారు. 2022-23లో రూ.5కోట్ల ఆదాయం రాగా 2021-22 ఆర్థిక సంవత్సరంలో రూ.4.05 కోట్లు లభించింది. 2023-24లో రూ.4,02,21,00 టార్గెట్ ఉండగా మార్చి చివరి నాటికి ఈ ఆర్థిక సంవత్సరం రూ.7.68 కోట్ల ఆదాయం వచ్చింది. మొక్కజొన్నపై అత్యధికంగా రూ.2.14 కోట్లు, ధాన్యం ద్వారా రూ.1.91 కోట్లు, వేరుశనగపై రూ.86.79లక్షలకు పైగా, పత్తికి రూ.43లక్షల ఆదాయం వచ్చింది. చెక్‌పోస్టుల ద్వారా రూ.25.92 లక్షలు, అదేవిధంగా రైతుల నుంచి నేరుగా కొనుగోళ్లపై రూ.2.23 కోట్లు, మార్కెట్ యార్డు ద్వారా ఆదాయం రూ.2కోట్లు లభించింది. అదేవిధంగా ప్రభుత్వం ద్వారా కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించిన మార్కెట్ ఫీజు దాదాపు రూ.కోటి వచ్చే అవకాశం ఉంది. అయితే మార్కెట్‌కు సంబంధించి ట్రెజరీలో దాదాపు రూ.8కోట్ల 53 లక్షలు ఉన్నట్లు తెలిసింది.

కట్నం వేధింపులు తాళ లేక..

- ఉరేసుకొని వివాహిత ఆత్మహత్య

మహబూబ్‌నగర్ మెట్టుగడ్డ, ఏప్రిల్ 1 : అదనపు కట్నం కోసం వేధించడంతో వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం రాత్రి జిల్లా కేంద్రంలో చోటు చేసుకున్నది. మహబూబ్‌నగర్ రూరల్ సీఐ గాంధీనాయక్ కథనం మేరకు.. పట్టణంలోని అయోధ్యనగర్‌కు చెందిన అంజమ్మ (30)కు కోయిలకొండ మండలం సూరారం గ్రామానికి చెందిన విష్ణువర్ధన్‌తో 2019లో పెండ్లి చేశారు. అంజమ్మ ప్రైవేట్ దవాఖానలో స్టాఫ్‌నర్సుగా పనిచేస్తుండేది. పెండ్లైన కొన్నేండ్ల నుంచే అదనపు కట్నం కావాలని భర్తతోపాటు అత్తామామలు తరచూ వేధించేవారు. దీంతో మనస్తాపానికి గురైన అంజమ్మ ఆదివారం రాత్రి ఇంట్లో చున్నీతో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన స్థానికులు వెంటనే ఆమెను కిందకు దించగా అప్పటికే మృతి చెందింది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని మృతదేహాన్ని ప్రభుత్వ జనరల్ దవాఖానకు తరలించారు. సోమవారం ఉదయం డీఎస్పీ వెంకటేశ్వర్లు విచారణ చేపట్టారు. మృతురాలికి తల్లిదండ్రులు లేరు. ఒక పాప ఉన్నది. అంజమ్మ అన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ వెల్లడించారు.

'నవోదయ' ఫలితాలు విడుదల

బిజినేపల్లి, ఏప్రిల్ 1: వట్టెం గ్రామంలోని జవహర్ నవోదయలో 6,9వ తరగతి ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదలైనట్లు విద్యాలయం ప్రిన్సిపాల్ భాస్కర్‌కుమార్ సోమవారం ప్రకటనలో తెలిపారు. ఇటీవల ఉమ్మడి పాలమూరు జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణులై ఎంపికైన విద్యార్థుల ఫలితాలు నవోదయ వెబ్‌సైట్‌లో పొందుపర్చినట్లు పేర్కొన్నారు. 6వ తరగతికి సంబంధించిన 80మంది, 9వ తరగతికి సంబంధించి 9మంది ఫలితాలను వారి వ్యక్తిగత ఫోన్ నెంబర్లకు వాట్సాప్, పోస్టు ద్వారా సమాచారం అందించడంతోపాటు సంబంధిత ఫారాలను పంపిస్తామని తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

పాలమూరు, ఏప్రిల్ 1 : మహబూబ్‌నగర్‌లోని అంబేద్కర్ కళాభవన్‌లో మూడు నెలల గ్రూప్స్ కోచింగ్‌కు ఎస్సీ అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ జిల్లా అధికారి పాండు సోమవారం ప్రకటనలో తెలిపారు. టెన్త్, డిగ్రీ, టీసీ, డిగ్రీ ప్రొవిజినల్, కులం, ఆదాయం ధ్రువీకరణ పత్రాలతో రిపోర్ట్ చేయాలని, వివరాలకు 8977340006 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.